సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం ၊ 31 ၊ మార్చి ၊ 2023



ఇదేం 'దారి'ద్ర్యం..!

కాదేదీ కబ్జాకు అనర్హం..తమ అవసరాలకు ఏదైనా అడ్డువస్తే దానిని అధిగమిస్తాం..ఇదీ టీడీపీ నాయకులు తీరు.

- 8లో



బుడి'బడి' అడుగులు వేద్దాం..!

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ విద్య చేరువ కానుంది. పేద విద్యార్థులకు 1వ తరగతిలో ఉచిత విద్యకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

- 8లో

నేడు చిరుధాన్యాల మహోత్సవం

పార్వతీపురం: జిల్లా కేంద్రంలో చిరుధాన్యాల మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్టు డీఆర్‌డీఏ పీడీ పి.కి రణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో చిరుధాన్యాల మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిరుధాన్యాలు, విత్తనాలు, చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార ఉత్పత్తులను ప్రదర్శించడం, విక్రయించనున్నట్టు తెలిపారు.



న్యూస్‌రీల్

పండుగ తేదీలు ఖరారు



గ్రామ దేవత విగ్రహం వద్ద తేదీలు ఖరారు చేసిన ఆలయ కమిటీలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం గ్రామ దేవతలైన ఎర్రకంచమ్మ, ఇప్పల పోలమ్మ పండుగను మే నెల 28, 29, 30 తేదీలలో నిర్వహించేందుకు ఆయా పండుగ కమిటీలు గురువారం జరిపిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఎక్కడా లేని విధంగా పార్వతీపురంలో ఇద్దరు గ్రామదేవతల పండుగ జరిపి, రెండు సిరిమానోత్సవాలు నిర్వహించి, అత్యంత వైభవంగా పండుగను జరపడం చాలా ఏళ్ల నుండి ఆనవాయితీగా వస్తుంది. కరోనా కారణంగా వాయిదా పడిన ఈ గ్రామ దేవత పండుగ ఐదేళ్ల తర్వాత జరపడం విశేషం.

నేడు జిల్లా న్యాయవాదుల సంఘ ఎన్నికలు

విజయనగరం లీగల్: ప్రతిష్టాకరమైన జిల్లా కేంద్ర న్యాయవాదుల సంఘ ఎన్నికలు శుక్రవారం జరగనున్నాయి. జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో ఉన్న న్యాయవాదుల సంఘ భవనంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ ఉంటుందని ఎన్నికల అధికారులు పి.శ్రీరామ్మూర్తి, పి.వరలక్ష్మి, ఆర్.రామకృష్ణ తెలిపారు. అదే రోజు ఫలితాలను ప్రకటిస్తామని వెల్లడించారు. సుమారు 550 మంది సభ్యులు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొంటారన్నారు. సభ్యులు తమ గుర్తింపు కార్డు లేదా సభ్యత్వ రుసుం చెల్లించిన రసీదు తీసుకురావాలని కోరారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు సభ్యులందరూ సహకరించాలని కోరారు. అధ్యక్ష పదవికి చొక్కాపు దామోదర రామ్మోహనరావు(దాము), సరిపల్లి నాగేశ్వరరావు, భోగాపురపు కృష్ణారావు పోటీ పడుతున్నారు. సంయుక్త కార్యదర్శి పదవికి పీటర్ మార్టిన్, సారిక సతీష్ బరిలో ఉన్నారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ పదవికి గునాన రాంబాబు, భవాని, సిహెచ్.రాజేష్, పి.ప్రసాద్ బరిలో నిలిచారు. కాగా ఉపాధ్యక్షులుగా అంజనీకుమార్, కార్యదర్శిగా వి.జి.సంతోష్, కోశాధికారిగా కోన చినఅప్పారావునాయుడు, జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా శనక సుబ్రహ్మణ్యం, పూజారి రమేష్, సిరిపురపు హరిమోహన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పారదర్శకంగా నియామకాలు జరపాలి



పీఓ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నేతలు

పార్వతీపురం టౌన్: ఐటీడీఏ పరిధిలో గురుకుల పాఠశాల, కళాశాలల్లో జరుగుతున్న ఉపాధ్యాయుల, అధ్యాపకుల నియామకాలు పారదర్శకంగా జరపాలని ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్‌ను గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, పి.భగవాన్ కోరారు. ఐటీడీఏ పీఓకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఏకలవ్య నియామకాలకు డెమో నిర్వహించాలని కోరారు. డెమో పీడీ సమక్షంలో జరగాలని విజ్ఞప్తి చేశారు. అనేక ఆరోపణలు ఉన్న ఇద్దరు గురుకుల ప్రిన్సిపాళ్లను నియామకం ప్రక్రియలో లేకుండా చూడాలని కోరారు. ఈ అంశాలపై పీడీ సానుకూలంగా స్పందించారు.

రోడ్డు విస్తరణ పనులు పరిశీలన

బొబ్బిలి: పట్టణంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ప్రధాన రహదారి విస్తరణ పనులను ప్రజారోగ్య శాఖ ఈఈ దక్షిణామూర్తి గురువారం పరిశీలించారు. ప్రస్తుతం తాగునీటి పైప్‌లైన్లు అమర్చుతున్నందున ఆ పనులకు అవసరమైన సూచనలు చేశారు. భవిష్యత్తులో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా పనులు చేయాలని సిబ్బందికి సూచించారు.

కల్యాణం.. కమనీయం...

రామతీర్థం భక్త జన సంద్రంగా మారింది. ఆలయ ప్రాంగణంతో పాటు కల్యాణ వేదిక ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగింది.



మాంగల్యధారణ మహోత్సవం

- వైభవంగా శ్రీసీతారాముల పరిణయం
- కనులారా వీక్షించి పులకించిన భక్త జనం
- జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన రామతీర్థం
- పట్టు వస్త్రాలను సమర్పించిన మంత్రి బొత్స దంపతులు

నెల్లిమర్ల రూరల్:

భక్తుల జయజయ ధ్వానాలు.. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు దశరథ పుత్రుడు శ్రీరామచంద్రస్వామి వారి కల్యాణ తంతు కొనసాగింది. సరిగ్గా 12 గంటలకు అభిజిత్ లగ్నంలో స్వామివారు సీతమ్మ తల్లి మెడలో మాంగల్య ధారణ చేశారు. స్వామివారి కల్యాణాన్ని అశేష భక్త జనులు కనులారా వీక్షించి తరించారు.

ఊరేగింపుగా పెళ్లికి పయనం

శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని ఆలయంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం 3గంటలకు ఆరాధన, బాలభోగం, సేవాకాలం కార్యక్రమాలను నిర్వహించారు. 6 గంటలకు యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమం చేపట్టారు. ఆలయంలో ఉన్న ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉంచి మంగళవాయిద్యాలు, భక్త జన సందోహం నడుమ కల్యాణ మండపం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. మండపంలోని మధ్య భాగంలో అమ్మవారిని, స్వామివారిని వేంచేయింపజేశారు. మండపంలో ఆశీనులైన శ్రీ సీతారాముల వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతరులు

వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం

శ్రీరామచంద్ర ప్రభువుకు ఏకాంతంగా అవతార సర్గ విన్నపం నిర్వహించారు. అనంతరం శ్రీసీతారామ లక్ష్మణులకు అత్యంత వైభవంగా పాలు, పెరుగు, నెయ్యి, తేనె, ఫల రసాలు, సముద్ర నదీ జలాలతో అభిషేకాన్ని జరిపించారు. అర్చక స్వాములు ప్రతీ తంతుకు వేదమంత్రాన్ని పఠిస్తూ కల్యాణాన్ని కొనసాగించారు. కల్యాణ తంతులో భాగంగా స్వామివారికి 'కన్యావరణ' 'యజ్ఞోపవీతధారణం' జరిపించారు. వధూవరుల వంశ గోత్ర నామాలను ప్రవచించారు. ఆశీర్వచనం, పాద ప్రక్షాళనం, పుష్పోదక స్నానం నిర్వహించి వరపూజ చేశారు. అనంతరం స్వామివార్లకు నూతన వస్త్రాలంకరణ చేశారు.

జీలకర్ర – బెల్లం

వేద పండితుల వేద మంత్రోచ్చారణ చేస్తూ సరిగ్గా 12గంటలకు అభిజిత్ లగ్నం సమీపించగానే జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని సీతారామస్వామి శిరస్సుపై ఉంచారు. అనంతరం అర్చకస్వాములు మంత్రాలను జపిస్తూ శాస్త్రోక్తంగా సాక్షాత్తు సీతమ్మ తల్లి మంగళ సూత్రాలను భక్త జనులకు చూపించి మాంగళ్యధారణ గావించారు. తరువాత ముత్యాల తలంబ్రాల వేడుకను కనుల పండువగా సాగించారు. భక్తులు సమర్పించిన పవిత్ర గోటి తలంబ్రాలతో తలంబ్రాల వేడుక సాగింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అశేషంగా తరలివచ్చిన భక్తుల రామనామ స్మరణతో కల్యాణ ప్రాంగణం మార్మోగింది. కల్యాణం అనంతరం స్వామివారి తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలను తీసుకొని భక్తులు తిరిగి పయనమయ్యారు.

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి బొత్స దంపతులు



స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న మంత్రి బొత్స కుటుంబ సభ్యులు

రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ దంపతులు వేడుకలకు హాజరై సింహాచలం దేవస్థానం నుంచి తెచ్చిన పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను స్వామివారికి సమర్పించారు. తొలుత ఆలయంలో సీతారాములను దర్శించుకున్న అనంతరం కల్యాణ వేదిక వద్దకు చేరుకొని అర్చకులకు పట్టు వస్త్రాలు అందజేశారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి తదితరులు కుటుంబ సమేతంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ వేదిక వద్ద వేంచేసి ఉన్న సీతారాములను దర్శించి కల్యాణాన్ని తిలకించారు. ఏపీ సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి స్వామిని దర్శించుకున్నారు. కల్యాణం జరుగుతున్నంతసేపు మైలవరపు శ్రీనివాసరావు ప్రత్యక్ష వ్యాఖ్యతగా స్వామివారి కల్యాణ గొప్పతనాన్ని భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత నృత్య కార్యక్రమం భక్తులను ఎంతగానో అలరించింది. కల్యాణోత్సవంలో జేసీ అశోక్, ఆర్డీఓ సూర్యకళ, ఈఓలు కిషోర్‌కుమార్, ప్రసాదరావు సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ గదల బంగారమ్మ, నగర పంచాయతీ చైర్మన్ సరోజని, జెడ్పీ చైర్మన్ తనయుడు మోహిత్, ఎంపీ, ఎమ్మెల్యే తనయులు బడ్డుకొండ మణిదీప్, ప్రదీప్, వంశీ, నేతలు మత్స సత్యన్నారాయణ, రేగాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పలువురు ఎస్‌ఐలకు బదిలీలు

విజయనగరం క్రైమ్: జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఎస్‌ఐలను బదిలీలు చేస్తూ ఎస్పీ ఎం.దీపిక గురువారం ఆదేశాలు జారీ చేశారు. గుర్ల ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న జి.శిరీష పెదమానాపురానికి, పెదమానాపురంలో పని చేస్తున్న బి.భాగ్యం బొబ్బిలికి, విజయనగరం ట్రాఫిక్‌లో పని చేస్తున్న ఎల్.దామోదరరావును గరివిడికి, ఎస్.హరిబాబునాయుడుకి గుర్లకి బదిలీ చేశారు. గరివిడి ఎస్‌ఐగా పని చేస్తున్న బి.మురళిని విజయనగరం ట్రాఫిక్‌కి, ఆంధ్ర ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్.సుదర్శన్‌ను సీసీఎస్‌కి బదిలీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న వారందరూ వెంటనే విధి నిర్వహణలో పాల్గొనాలని ఆదేశించారు.

రామయ్య సేవలో...



రామతీర్థం చేరుకున్న ప్రకాశరావు

విజయనగరం పూల్‌బాగ్: ఒంటిపై కాషాయ చొక్కా.. చేతిలో రామకోటి ప్రతులు... తోడుగా ఓ పాత సైకిల్... గుండెల నిండా అసమాన భక్తి వెరసి లంక ప్రకాశరావు. ఇంటిపేరు లంక అయినా ప్రకాశరావు మనసంతా అయోధ్యే. సోంపేట మండలం పాత్రఖండ గ్రామానికి చెందిన 57 ఏళ్ల ఈ రామభక్తుడు పాతికేళ్లుగా సైకిల్‌పై విరామం ఎరగకుండా ప్రయాణం చేస్తున్నారు. అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం నుంచి భద్రాచలం వరకూ వెళ్లాలన్నా.. సైకిల్‌పై దూసుకెళ్లిపోవటమే ఆయనకు తెలిసింది. అవివాహితుడైన ప్రకాశరావుకు కుటుంబం అంటూ ఏమీలేదు. రాముడిపై భక్తితో దాదాపు రెండు దశాబ్దాలుగా రామకోటి ప్రతులను భద్రాచలం వరకు చేరుస్తుంటారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని ప్రకాశరావు గురువారం రామతీర్థం చేరుకున్నారు.

పాలనలో కీర్తి.. యువతకు స్ఫూర్తి

అందరూ యువ అధికారులే. 25 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సులు. విధుల నిర్వహణలో పోటీ పడుతున్నారు. నిధుల సద్వినియోగమయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా సంక్షేమ, అభివృద్ధి పాలనను ప్రజలకు చేరువ చేస్తున్నారు. గిరిజన యువతను సన్మార్గంలో నడిపేందుకు 'ఉద్యోగ' ప్రణాళికలు అమలు చేస్తున్నారు. యువతకు స్ఫూర్తి మంత్రం వినిపిస్తూ... పార్వతీపురం మన్యం జిల్లాను ప్రగతిపథంలో నడుపుతున్నారు. ఆ యువ అధికారుల పనితీరుకు 'సాక్షి' అక్షర రూపం.

- మన్యం అభివృద్ధిలో యువ అధికారుల కీలక భూమిక
- నిధులు సద్వినియోగంలో ముందంజ
- లక్ష్యానికి మించి 'ఉపాధి' కల్పన
- స్పందన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ
- భూముల రీసర్వేలో ప్రథమ స్థానం
- స్కిల్‌హబ్‌లలో యువతకు శిక్షణ, ఉద్యోగ అవకాశాల కల్పన

విజయనగరం డెస్క్:

పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడి ఏడాది పూర్తయ్యేందుకు మరో నాలుగు రోజులు(2022 ఏప్రిల్4) సమయం ఉంది. ఏడాది కాలంలో జిల్లా పాలన, అభివృద్ధిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. జిల్లాస్థాయి అధికారులు అందుబాటులో ఉండడం.. అందులోనూ 90 శాతం మంది యువ అధికారులే కావడం, పాలకులు పూర్తిస్థాయిలో సహకరిస్తుండడంతో పనుల ప్రణాళిక పక్కాగా అమలవుతోంది. ప్రతిపైసా సద్వినియోగమవుతోంది. ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తోంది. సంక్షేమ, అభివృద్ధి పాలన ప్రజలకు చేరువైంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు ప్రగతిపట్టాలెక్కాయి. చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం లభిస్తోంది. గిరిపుత్రుల్లో ఉద్యోగ వికాసం కనిపిస్తోంది. అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర లభిస్తోంది. వైద్యానికి భరోసా లభించింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఆశయం నెరవేరుతోంది.



సీతంపేట మండలంలో రహదారిని పరిశీలిస్తున్న కలెక్టర్, పీఓ నవ్య (ఫైల్)

■ విశ్రాంతి తెలియని నిషాంత్ కుమార్

రాజస్థాన్‌లోని న్యాయవాద కుటుంబంలో 1990లో జన్మించిన నిషాంత్‌కుమార్ గుంటూరు మున్సిపల్ కమిషనర్‌గా, అనంతపురం జేసీగా, రంపచోడవరం ఐటీడీఏ పీఓగా, తిరుపతి సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా ఏడాది కిందట బాధ్యతలు స్వీకరించారు. జిల్లా అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేస్తూ... ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ జిల్లా అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నారు. వేకువజామునే నిద్రమేల్కొంటారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణపై నిఘా వేస్తారు. అవసరమైతే సైకిల్‌పై పట్టణాన్ని చుట్టేస్తారు. ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే వెళ్లి పరిష్కారానికి చొరవచూపుతారు. వీరఘట్టం మండలం చలివేంద్రి గ్రామ రైతుల ధాన్యం కొనుగోలు సమస్యను వారంరోజుల్లో పరిష్కరించి వారితోనే సత్కారం పొందడం ఆయన పనితీరుకు నిదర్శనం. భామిని మండలంలో వంశధార కాలువ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి స్థల సేకరణ, ఎన్‌సీఎస్ రైతుల సమస్య పరిష్కారంలో కీలకపాత్ర పోషించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రగతికి అవిశ్రాంతంగా కృషిచేస్తున్నారని, ఆయన ఏ పథకం అమలుచేసినా అందులో ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలు స్పష్టంగా కనిపిస్తాయని, జిల్లా అధికారిగా ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చడమే తన ముందున్న కర్తవ్యమని సెలవిచ్చారు.

■ విద్యాసాగర్ పోలీస్ మార్క్



బైక్‌పై గిరిజన గ్రామాలను సందర్శిస్తున్న ఎస్పీ

మన రాష్ట్రంలోని నర్సాపురంలో 1992లో జన్మించిన విద్యాసాగర్‌నాయుడు పార్వతీపురం మన్యం జిల్లాలో శాంతిభద్రతల పర్యవేక్షణలో ఎస్పీగా తనదైన ప్రతిభ చూపుతున్నారు. బైక్‌పై గిరిశిఖర గ్రామాల్లో పర్యటిస్తున్నారు. గిరిజన యువతలో విద్య, ఉద్యోగ చైతన్యం నింపుతున్నారు. సారా మహమ్మారి నుంచి విముక్తి కల్పిస్తున్నారు. మనఊరు–మన పోలీస్ కార్యక్రమంతో గిరిజనులకు చేరువై.. వారి సమస్యలను పరిష్కరిస్తున్నారు.

■ నూరల్‌కమర్ చదువు మంత్రం

బీహార్ రాష్ట్రానికి చెందిన నూరల్‌కమర్ పాలకొండ సబ్‌లెక్టర్‌గా ఐదు నెలల కిందట బాధ్యతలు స్వీకరించారు. విధి నిర్వహణలో చూపుతున్న చురుకుదనం మిగిలిన ఉద్యోగుల్లో స్ఫూర్తినింపుతోంది. చదువుతోనే పిల్లల భవిష్యత్ మారుతుందన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో ఆయనకు ఆయనే సాటి. ప్రతి శనివారం పాఠశాలలను పర్యవేక్షిస్తూ.. విద్యార్థులకు చదువు వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు.



విద్యార్థులతో సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్

● నైపుణ్యంతో ఉపాధి



ఎమ్మార్‌నగరం స్కిల్‌హబ్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేసి, కంపెనీల అవసరాలకు అనుగుణంగా మానవ వనరులను తీర్చిదిద్ది, యువతకు ఉపాధిచూపే బృహత్తర క్రతువును చేపట్టింది. దీనిని నెరవేర్చడంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ సఫలీకృతమయ్యారు. గిరిజన యువతకు జిల్లాలోని ఆరు స్కిల్‌హబ్‌లలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆరు జాబ్‌మేళాలు నిర్వహించి 1200 మంది యువతకు వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించారు. స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తున్నారు.

● గిరిజనుల్లో 'ఆనంద'ం

కేరళ రాష్ట్రానికి చెందిన 31ఏళ్ల వయసున్న ఒ.ఆనంద్ పార్వతీపురం మన్యం జిల్లా ప్రజల్లో ఆనందం నింపుతున్నారు. నిరంతరం ప్రజలతోనే మమేకమవుతూ పాలనలో తనదైన ముద్రవేస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం కింద చేపట్టిన భూముల రిసర్వే లక్ష్య సాధనలో రాష్ట్రంలోనే మన్యం జిల్లాను ముందంజలో నిలిపారు. తనదైన శైలిలో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను చేరువచేస్తున్నారు. ధాన్యం కొనుగోలు, బిల్లుల చెల్లింపులో ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించారు. తన భార్యను ప్రసవం కోసం ప్రభుత్వాస్పత్రిలో చేర్చి ప్రభుత్వ వైద్యంపై గిరిజన ప్రజలకు పూర్తిభరోసా కల్పించారు.

2022–23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఉపాధిహామీ పథకం అమలు ఇలా...

మండలాలు	15
పంచాయతీలు	452
జాబ్‌కార్డులు	2.70 లక్షలు
వేతనదారుల సంఖ్య	4.69 లక్షలు
పనుల్లో పాల్గొనేవారు	3.64లక్షలు
వేతనాల రూపంలో చెల్లించిన నగదు	180.01కోట్లు
పనిదినాల సంఖ్య	94.28లక్షలు

కొత్తజిల్లా ఏర్పడిన నుంచి వచ్చిన స్పందన వినతులు	5,664
పరిష్కరించినవి	5,469
పరిశీలనలోఉన్నవి	185

● వైద్య భరోసా



జిల్లా ఆస్పత్రిలో చిన్నారి బరువును పరిశీలిస్తున్న డీఐఓ జగన్మోహనరావు

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా కొనసాగుతున్న జగన్మోహనరావు జిల్లా ప్రజలకు వైద్యభరోసా కల్పిస్తున్నారు. కరోనా నిర్మూలనలో భాగంగా జిల్లాలో 4.56 లక్షల బూస్టర్‌డోస్‌ల పంపిణీలో కీలకపాత్ర పోషించారు. చిన్నపిల్లలకు వ్యాధినిరోధక టీకా నిర్వహణలో 95 శాతంతో రాష్ట్రంలోనే జిల్లాను మొదటిస్థానంలో నిలపడంలో తనదైనశైలిలో ముందుకు సాగారు. మాతాశిశు మరణాల నిర్మూలనకు కృషిచేస్తున్నారు. యువ అధికారిగా వైద్యసిబ్బందికి సేవా స్ఫూర్తి మంత్రం వినిపిస్తున్నారు.

● గిరిజన వికాసమే లక్ష్యంగా...

జిల్లాలో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పీఓలు విష్ణుచరణ్, నవ్యలు గిరిజన ప్రగతికి అవిశ్రాంతంగా కృషిచేస్తున్నారు. ప్రతి సోమవారం 'జగనన్నకు చెబుదాం' (స్పందన)లో గిరిజనులు అందించిన వినుతుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నా రు. అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పనకు కృషి చేస్తున్నారు. జీసీసీ కొనుగోళ్లను పెంచారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చక్కని విద్యాబోధన సాగేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఉద్యాన, చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నారు. సచివాలయ సేవలు సక్రమంగా అందేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.



కె.పాడులో చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న పీఓ విష్ణుచరణ్

క్లుప్తంగా

పరుగు పెట్టించిన 'కరి' గుంపు


తోటలకు తిరుగుముఖం పడుతున్న ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని పక్కుడుభద్ర జీడితోటల్లో మకాం వేసిన ఆరు ఏనుగుల గుంపు జీడి రైతులను పరుగులు పెట్టించాయి. తోటల్లోని జీడి పంటను ఏరడానికి వెళ్తున్న తమను బెదిరిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో బుధవారం పక్కుడుభద్ర తోటల్లోని ఏనుగుల గుంపును తరలించడానికి గిరిజనులు, తోట యాజమానులు చేసిన ప్రయత్నం విఫలమైంది. తోటల నుంచి బొమ్మిక మీదుగా ఏబీ రోడ్డు వరకు గిరిజన రైతులు ఏనుగులను వెంటబెట్టారు. పల్లపు ప్రాంతాలకు రాగానే ఏనుగుల గుంపు ఒక్కసారిగా రైతుల మీదకు తిరగబడినట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. దీంతో రైతుల ప్రయత్నాలు బెడిసికొట్టాయి. తరువాత ఏనుగులు గుంపు యథాస్థానమైన జీడితోటలకు చేరుకున్నాయి. ఈ ఏనుగుల గుంపు ప్రవర్తన వేరేగా ఉందని, ఎలిఫెంట్ ట్రాకర్లు అభిప్రాయపడుతున్నారు.

కోడి పందాలపై దాడి

- ముగ్గురి అరెస్ట్, మూడు కోడి పుంజులు స్వాధీనం

లక్కవరపుకోట: మండలంలోని గేదెలవాని పాలెం గ్రామం సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న కోడిపందాలపై ఎల్.కోట ఎస్సై ముకుందరావు సిబ్బందితో కలిసి గురువారం దాడి చేశారు. కోడి పందాలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.300 నగదు,మూడు కోడి పుంజలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న సతీష్‌కుమార్

పార్వతీపురం: సీతానగరం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఆర్. సతీష్‌కుమార్ కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలిలా ఉన్నాయి. కొద్ది కాలంగా కడుపునొప్పి కోసం మందులు వాడుతున్నప్పటికీ తగ్గకపోవడంతో మనస్తాపానికి గురైన సతీష్ కుమార్ పొలానికి వాడగా ఇంట్లో మిగిలిన గడ్డిమందు తాగాడు. ఈ విషయాన్ని తల్లి గమనించి స్థానికులకు తెలియజేయగా ఆటోలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పురుగు మందు తాగి మరొకరు..


చికిత్స పొందుతున్న అప్పలస్వామి

పార్వతీపురం మండలం సంగంవలసకు చెందిన టి.అప్పలస్వామి మనస్తాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అప్పలస్వామి ఆరోగ్యం ఎప్పటికీ కుదుటపడకపోడంతో మనస్తాపానికి గురై పురుగు మందుతాగేశాడు. గమనించిన కుటుంబసభ్యులు ఇంట్లో ప్రాథమిక చికిత్స చేసి 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గార: మండలంలోని నిజామాబాద్ గ్రామం వద్ద సీసీ రోడ్డులో గురువారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం శ్రీకూర్మం కోవెలవీధికి చెందిన కోరాడ రాధాకృష్ణ (57) తన కుమార్తె కోరాడ సునీత (తోనంగి వీఆర్‌ఓ), మనవడితో కలసి గురువారం సాయంత్రం బైక్‌పై గార నుంచి శ్రీకూర్మం వైపు వెళ్తున్నారు. అదే సమయంలో నిజామాబాద్ గ్రామానికి భైరి లచ్చయ్య నడుచుకుంటూ వస్తుండగా బైక్ ఆయనకు తగిలి అంతా కింద పడిపోయారు. రాధాకృష్ణ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. కుమార్తె, మనవడికి స్వల్పంగా గాయాలయ్యాయి. భైరి లచ్చయ్యకు కూడా స్వలంగా గాయాలయ్యాయి.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

ఇదేం 'దారి'ద్ర్యం..!

- సాగునీటి కాలువ కప్పేసి రహదారి ఏర్పాటు
- టీడీపీ నాయకుడిపై పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు


కొండగెడ్డ కాలువకు అడ్డంగా వేసిన రోడ్డు (ముందర భాగం)


రోడ్డు వెనుకభాగం


తనపొలానికి కాలువ మీదుగా టీడీపీ నాయకుడు వేసిన రోడ్డు

బొబ్బిలి రూరల్: కాదేదీ కబ్జాకు అనర్హం..తమ అవసరాలకు ఏదైనా అడ్డువస్తే దానిని అధిగమిస్తాం ..ఇదీ టీడీపీ నాయకులు తీరు. పార్టీ అధినేత నుంచి చోటానాయకుల వరకు అదేతీరున ఇంకా వ్యవహరిస్తూ ప్రజలు, అధికారుల కళ్లుగప్పే యత్నం చేస్తూనే ఉన్నారు. మండలంలోని కంచరగెడ్డ రిజర్వాయర్‌కు, రామభద్రపురం మండలంలోని గొల్లల పేటతో పాటు పలు గ్రామాలకు సాగునీరందించే గెడ్డకాలువ ప్రవహించే ప్రాంతానికి అడ్డంగా మండలంలో కాశిందొరవలస పంచాయతీ పరిధిలో మోసూరువలస గ్రామం వద్ద మట్టిరోడ్డు వేసేశాడో టీడీపీ నాయకుడు. కాశిందొరవలసకు చెందిన టీడీపీ నాయకుడు కొత్తకోట వెంకటరమణకు మోసూరువలసలో కొండగెడ్డ కాలువపైన 4ఎకరాల పొలం ఉంది. ఆ పొలానికి మార్గం లేకపోవడంతో కొండగెడ్డకాలువమీదుగా (కాలువ ప్రవాహానికి అడ్డంగా) మట్టిరోడ్డు వేశాడు. రోడ్డు వేయడానికి ప్రయత్నిస్తున్న సమయంలోనే వీఆర్వో గౌరీశంకరరావు హెచ్చరిస్తే కొద్దిరోజులు పని నిలిపివేసి, ఇటీవల రాత్రికి రాత్రి ఎదురుగా ఉన్న ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా కంకర తవ్వేసి రోడ్డు వేశారు. దీనిపై వీఆర్వో హెచ్చరించినా వినకుండా ఏం చేసుకుంటావో చేసుకో అని దురుసుగా మాట్లాడారు. దీంతో వీఆర్వో గౌరీశంకరరావు రాతపూర్వకంగా తహశీల్దార్ రాజారావుకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన తహసీల్దార్ సాగునీటి కాలువకు అడ్డంగా రోడ్డు వేసిన ఘటనపై విచారణ చేసి చర్యలు చేపట్టాలని బొబ్బిలి స్టేషన్ హౌస్ అధికారికి ఫిర్యాదు చేశారు.

అధికారులపై ప్రత్యారోపణలు

ఈ మేరకు టీడీపీ నాయకుడు వెంకటరమణను సీఐ నాగేశ్వరరావు పిలిచి బుధవారం విచారణ చేశారు. తాను చేసిన తప్పును టీడీపీ నాయకుడు ఒప్పుకోకుండా.. రెవెన్యూ అధికారులను తనను డబ్బులు అడుగుతున్నారంటూ ప్రత్యారోపణ చేశాడు. ఈ విషయమై విచారణ చేసిన సమగ్రనివేదిక ఇవ్వాలని, దీనిపై తాము కేసు నమోదు చేస్తామని రెవెన్యూ వర్గాలకు సీఐ సూచించారు. తాను స్థానిక గిరిజనులం కలిసి రోడ్డు వేశామని, కాలువ ప్రవాహానికి వీలుగా పైపులు వేస్తామని వెంకటరమణ విలేకరులకు తెలిపాడు.

రైతు బజార్ల అభివృద్ధికి చర్యలు

- మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే
- మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్ పనులపై సంతృప్తి


మార్కెట్ యార్డులో అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర మార్కెటింగు శాఖ కమిషనర్ రాహుల్ పాండే

పార్వతీపురంటౌన్: రైతు బజార్ల అభివృద్ధికి పూర్తి చర్యలు చేపట్టామని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు గురువారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా పార్వతీపురంలోని రైతుబజార్, వ్యవసాయ మార్కెట్ యార్డు, మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్ పరిశీలించారు. రైతు బజారులో రైతులు, కొనుగోలు దారులతో ముఖాముఖి మాట్లాడారు రైతు బజారును ఇంకా అభివృద్ధి చేయాలని, అన్ని దుకాణాలు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు బజారులో వినియోగదారులు అధికంగా వచ్చే విధంగా చేయాలని తద్వారా రైతులకు ఆదాయం పెరుగుతుందని, అదేసమయంలో రైతు బజారు మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశాలు ఉంటాయని సూచించారు. రైతు బజారు రైతుల అభివృద్ధికి దోహదం కావాలని ఆకాంక్షించారు. కొమరాడలో రూ.40 లక్షలతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ పరిశీలించిన మిమీషనర్ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. డ్రైయింగ్ ప్లాట్‌ఫారం, 60 మెట్రిక్ టన్నుల వేయింగ్ బ్రిడ్జిని త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని పేర్కొన్నారు.

లక్ష్యానికి మించిన ఆదాయంపై అభినందనలు

పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాం వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శులతో మాట్లాడుతూ గత ఏడాది నిర్దేశించిన రూ.7.27 కోట్ల లక్ష్యానికి రూ.12 కోట్లు సాధించడంపై అభినందించారు. కార్యక్రమంలో ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు పి.సుధాకర్, ఉప సంచాలకుడు ఎస్. యర్రన్న, వ్యవసాయ మార్కెట్ యార్డు స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి బి.శ్రీనివాస రావు, జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి ఎల్.అశోక్ కుమార్, విజయనగరం జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి శ్యామ్‌కుమార్, పర్యవేక్షకులు సుధీర్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగావళిలో యువకుడి గల్లంతు


గల్లంతైన కార్తీక్ (ఫైల్)

గరుగుబిల్లి: మండలంలోని కొత్తూరుకు చెందిన యువకుడు అన్నుకార్తీక్(17) గురువారం నాగావళి నదిలో గల్లంగయ్యాడు. ఈ సంఘటనపై స్థానిక ఏఎస్సై రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కార్తీక్ మేతకోసం పశువులను నదివైపు తోలుకుని వెళ్లాడు. రెండు ఆవులు నది దాటి ఆవలవైపు వెళ్లిపోవడంతో వాటిని తెచ్చేందుకు నదిలోకి దిగగా పైనుంచి నీటి ప్రవాహంతో పాటు గోతులు ఉండడంతో గల్లంతయ్యాడు. యువకుడిని రక్షించేందుకు గజ ఈతగాళ్లు గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. ఈ మేరకు తండ్రి వెంకట్, తల్లి అనూషలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఫిర్యాదు మేరకు యువకుడి గల్లంతుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ

భోగాపురం: ఓ లారీ అదుపుతప్పి వేరే లారీని ఢీకొనడంతో డ్రైవర్ షేక్ నసీజ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. భోగాపురం జాతీయ రహదారిపై గురువారం ఈ ప్రమాదం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వేకువజామున మూడుగంటల ప్రాంతంలో విశాఖపట్నం నుంచి డ్రమ్ముల లోడుతో శ్రీకాకుళం వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో అదుపుతప్పి డివైడర్‌ను దాటుకుని శ్రీకాకుళం నుంచి ఐరన్ లోడుతో విశాఖపట్నం వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న లారీ డ్రైవర్ తీవ్రగాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి...


చికిత్స పొందుతున్న పోలినాయుడు

పార్వతీపురం: ట్రాక్టర్ ఢీకొనడంతో మక్కువ మండలం మార్కొండపుట్టి గ్రామానికి చెందిన ఎల్. పోలినాయుడు గాయాలపాలయ్యాడు. గురువారం ఉదయం స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంపై పోలినాయుడు పార్వతీపురం వస్తుండగా వెంకంపేట గోరీలవద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో పోలినాయుడి కుడి కాలు, ఇతర భాగాల్లో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనం ద్వారా జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ఈ మేరకు అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్రలు మీద పడి లారీ డ్రైవర్ మృతి


కర్రల కింద ఇరుక్కుని మృతి చెందిన డ్రైవర్ శ్రీరాములు (ఇన్‌సెట్లో) శ్రీరాములు (ఫైల్)

బొండపల్లి: విజయనగరం నుంచి ఒడిశాలోని రాయగడకు కర్రల లారీతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడడంతో లారీలోని కర్రలు మీద పడి ఊపిరాడక డ్రైవర్ మృతి చెందాడు. గురువారం వేకువజామున జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై ఎస్.రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మెరకమొడిదాం మండలం ఊటపల్లి గ్రామానికి చెందిన రెడ్డి శ్రీరాములు(55) బతుకుతెరువు నిమిత్తం రాయగడ వెళ్లి కొన్ని సంవత్సరాలుగా భార్యాబిడ్డలతో అక్కడే నివాస ఉంటూ లారీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో విజయనగరం నుంచి సరుగుడు కర్రల లోడుతో వస్తుండగా బోడసింగిపేట గ్రామానికి సమీపంలోని సాయిసిద్ధార్థ కాలేజీని అనుకుని జాతీయ రహదారి26పై లారీ అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్‌పై కర్రలు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. కర్రల కింద ఇరుక్కుపోయిన మృతదేహన్ని రెండు గంటల పాటు శ్రమించి పోలీసులు బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి..


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పులి కొండ

గజపతినగరం: గజపతినగరం పోలీస్ స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన సంఘటనలో పులి కొండ (53) అనే సాధువు మృతి చెందాడు. గురువారం ఉదయం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా జొన్నగుడ్డి ప్రాంతానికి చెందిన పులి కొండ గజపతినగరం మండలం పురిటిపెంట మామిడి బంద కాలనీలో ఉన్న సోదరి చిన్నమ్మలు ఇంటికి 10ఏళ్ల క్రితం వచ్చేశాడు. అప్పటినుంచి సోదరి ఇంటివద్దనే ఉంటూ నిత్యం భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గురువారం ఉదయం శ్రీరామ నవమి సందర్భంగా పురిటిపెంట మండల వారి కాలనీలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్తుండగా జాతీయ రహదారి వద్ద పోలీస్‌స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగరాజు తెలిపారు.

కేన్సర్ బాధిత చిన్నారికి ఆర్థిక సాయం

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారి లండ యుగంధర్ కేన్సర్‌తో బాధ పడుతున్న సంగతి తెలిసిందే. చిన్నారి పరిస్థితిపై 'సాక్షి'లో కథనం కూడా ప్రచురితమైంది. కవిటి మండలం భైరిపురం గ్రామానికి చెందిన రేస్ ఫౌండేషన్ చైర్మన్ పుల్లట ప్రవీణ్ బాధిత బాలుడి కుటుంబానికి తన వంతుగా రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. చిన్నారికి మెరుగైన వైద్యం అందించడం కోసం హైదరాబాద్‌లోని ప్రముఖ క్యాన్సర్ ఆస్పత్రిని సంప్రదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గొనప రవి,బిసాయి రవి, బల్లెడ మురళీకృష్ణ పాల్గొన్నారు.

సిక్కోలు ఉద్దానం సేవా సమితి సాయం..

పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధిత చిన్నారి లండ యోగేంద్ర వైద్యం కోసం సిక్కోలు ఉద్దానం సేవా సమితి వారు రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు కామేష్‌రెడ్డి, కామేష్, హరి, వేణు, అనిల్, శరత్ రామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బుడి'బడి' అడుగులు వేద్దాం..!

- ఒకటో తరగతి విద్యార్థులకు 'ప్రైవేట్' విద్యకు అవకాశం
- ఆన్‌లైన్ పోర్టల్‌లో జిల్లాలోని 283 ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల నమోదు
- పేద విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం


ఒకటవ తరగతిలో ప్రవేశించనున్న చిన్నారులు

విజయనగరం పూల్‌బాగ్: రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ విద్య చేరువ కానుంది. జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్‌లో 25 శాతం పేద విద్యార్థులకు 1వ తరగతిలో ఉచిత విద్యకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు ఎంపిక చేసుకునేందుకు ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రతి కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను ఆన్‌లైన్ పోర్టల్‌లో ముందుగా నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో విజయనగరం జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు 283 ఉండగా అవన్నీ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదయ్యాయి. వాటిలో సీటు పొందితే 8వ తరగతి వరకు విద్యార్థుల ఫీజును రాష్ట్ర ప్రభుత్వం అమ్మఒడి పథకం ద్వారా ఆయా పాఠశాలలకు నేరుగా చెల్లించనుంది. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఏర్పాట్లు చేయాలన్న ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. ప్రవేశాల కోసం హెచ్‌టిటిపి //సిఎస్‌ఈ. ఎపి.జిఓవి.ఇన్// వెబ్‌సైట్‌లో చూడవచ్చు. 2022-23 లో జిల్లాలో 272 మంది దరఖాస్తు చేశారు. 214 మంది పాఠశాలలో చేరారు. ఈ ఏడాది మరింత ఎక్కువ మంది పేద విద్యార్థులు లబ్ధిపొందేలా అధికారులు చర్యలు చేపట్టారు.

ఇద్దందుల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్

ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్‌లో అర్హులైన పేదవర్గాల విద్యార్థులు ఉచిత సీట్లు పొందే విషయంలో ఇబ్బందులు ఎదురైతే సకాలంలో పరిష్కరించడానికి ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం 14417 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచింది. విద్యార్థుల తల్లిదండ్రులు నేరుగా టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. గ్రీవెన్స్‌లో సత్వర పరిష్కారానికి డీఈఓ, ఎంఈఓ స్థాయిలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటుచేస్తున్నారు.

సీట్ల కేటాయింపు ఇలా..

ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్‌లో 2023-24 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో తప్పనిసరిగా 25 శాతం సీట్లు పేదలకు కేటాయించాలి. అందులో అనాథలు, దివ్యాంగులు, హెచ్ఐవీ బాధిత పిల్లలకు ఐదుశాతం, ఎస్సీలకు పది శాతం, ఎస్టీలకు నాలుగు శాతం, ఇతర వర్గాలకు ఆరు శాతం సీట్లు కేటాయించారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షికాదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో అయితే రూ. 1.41 లక్షల లోపు ఉన్నవారే అర్హులు.

ఫీజు చెల్లింపు

పాఠశాలలో సీటు పొందిన విద్యార్థులు ఏడాదికి ఎంత ఫీజు చెల్లించాలనేది ప్రభుత్వం నిర్ణయించింది. అర్బన్‌లో రూ.8 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.6,500, గిరిజన షెడ్యూల్ ప్రాంతాల్లో రూ.5,100 అమ్మ ఒడి పథకం కింద విద్యార్థులు ప్రవేశం పొందిన పాఠశాలలకు ప్రభుత్వం చెల్లించనుంది.

ఎక్కడెక్కడ పాఠశాలలు ఉన్నాయంటే

జిల్లాలోని 27 మండలాల్లో బాడంగి మండలంలో 4, భోగాపురంలో 5, బొబ్బిలిలో 25, బొండపల్లిలో4, చీపురుపల్లిలో 8, దత్తిరాజేరులో 3, డెంకాడలో 11, గజపతినగరంలో 5, గంట్యాడలో 9, గరివిడిలో 6, గుర్లలో 2 జామిలో 10, కొత్తవలసలో 17, లక్కవరపుకోటలో 6, మెంటాడలో 4, మెరకముడిదాం లో 4, నెల్లిమర్లలో 13, పూసపాటిరేగలో 10, ఆర్. ఆముదాలవలసలో 1, రాజాంలో 20, రామభద్రపురంలో 3, సంతకవిటిలో 5, శంగవరపుకోటలో 16, తెర్లాంలో 4, వంగరలో 2, వేపాడలో 2, విజయనగరంలో 84 కలిపి మొత్తం 283 పాఠశాలలు ఆన్‌లైన్‌లో పొందుపరిచి ఉన్నాయి.

అర్హులకు సీట్లు ఇవ్వాల్సిందే



పేద విద్యార్థులకు ఇదో వరం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంచి ఆలోచనతో ఈ పథకం అమలు చేస్తున్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్‌లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు తప్పనిసరిగా ఇవ్వాలి. దీన్ని మండల విద్యాశాఖాధికారులు సీరియస్‌గా తీసుకోవాలి. మా లెక్కల ప్రకారం ఒకటో తరగతిఉన్న ప్రైవేట్, కార్పొరేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలు 283 పాఠశాలలున్నాయి. అవన్నీ కూడా ఆన్‌లైన్ లో నమోదయ్యాయి.

– బి లింగేశ్వరరెడ్డి, డీఈఓ, విజయనగరం

క్రీడాకారిణికి అభినందనలు


కిరణ్‌కుమారిని అభినందిస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

కంచిలి: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన లండ కిరణ్ కుమారి వరుస స్వర్ణ పతకాలతో దూసుకుపోతోంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఈ అమ్మాయి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నెల్లూరులో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ తృతీయ సీనియర్, జూనియర్ ఫ్లోర్ కర్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించి నేషనల్‌కి ఎంపికైంది. ఈ మేరకు ఆమెకు మామిడి పల్లి గ్రామంలో కుటుంబసభ్యులు, గ్రామస్తులు అభినందన సభను గురువారం నిర్వహించారు.

మే నెలలో జరుగనున్న జాతీయస్థాయి ఫ్లోర్ కర్లింగ్ చాంపియన్‌షిప్‌కి ఎంపికైన మొదటి సిక్కోలు వీర మహిళగా గుర్తింపు పొందింది. ఈ అమ్మాయి నేషనల్‌లో కూడా మంచి గుర్తింపు సాధించి దేశానికి పేరు తీసుకురావాలని ఆశిస్తున్నామని తండ్రి సూర్యనారాయణ, కోచ్ సురేంద్ర రెడ్డి తెలిపారు.

జింకపై కుక్కల దాడి

పాతపట్నం: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద కుక్కలు చుక్కల జింకపై దాడి చేసి చంపేశాయి. జోగికొండ నుంచి గురువారం ఉదయం నీటి కోసం జింక కిందకు రావడంతో కుక్కలు చూసి వెంబడించి దాడి చేశాయి. స్థానికులు దీన్ని చూసి కుక్కలను తరిమి జింకకు తమ వద్ద రక్షణ కల్పించారు. అటవీ శాఖకు సమాచారం అందించడంతో వారు వచ్చి తమ కార్యాలయానికి తీసుకెళ్లారు. అయితే కాసేపటి కే జింక చనిపోయింది. కుక్కల దాడిలో జింక లు చనిపోవడం ఈ మధ్య పెరిగిపోతోంది. గురువారం ఉదయమే ఫారెస్ట్‌లో వాటర్ టబ్బులను ఏర్పాటు చేశారు. అయినా జింక కిందకు రావడంతో కుక్కల దాడిలో మృతిచెందింది.

సాక్షి క్లాసిఫైడ్స్

COACHING CENTER
- EAMCET, I-CET & For ALL COMPETITIVE Exams. New Batches on 01-04-2023 @ 9am. SURYA ACADEMY, GURAJADA Road, Kota Jn.,Vizianagaram. Ph : 99490 03295 [V-6104]

SERVICES
- అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత, టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ✆ 8699691739. [T-1793]
- వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేక్‌ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 94630 26237. [T-1800]

WANTED
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని 83500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9959617233, 6305641071 [M-1190657]

- ప్రముఖ బ్యాంకుల యందు కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ చేయడానికి ఫిమేల్ స్టాఫ్ అ.కా.ను. జీ.15K to 34K ఇంట్రెస్ట్ ఉన్నవారు డీటెయిల్స్ వాట్సాప్ చేయండి. ఫోన్ : 6281159171 [HA-28700]
- VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp Dr, Q: 5th- డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూ ఫ్రీ, Hyd, Ph: 7995365999 [HA-1151]
- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్, ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795294]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.